ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 28 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2pm

# కోర్టుకెక్కిన రాజ్ పాకాల






**హైదరాబాద్, ప్రజాస్వరం :** జన్వాడ రేవ్ పార్టీ కేసు కీలక మలుపు తిరిగింది. తనని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయాలని ప్రయత్నిస్తున్నారని, తనని అరెస్ట్ చేయకుండా పోలీసులను ఆదేశించాలంటూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోపక్క జన్వాడ రేవ్ పార్టీ కేసులో మోకిలా పోలీసులు కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు. బీఎన్ఎస్ యాక్ట్ 35(3) సెక్షన్ ప్రకారం ఈ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే రాజ్ పాకాల ఇంట్లో లేకపోవడంతో ఓరియన్ విల్లాస్‌లోని నెంబర్ 40 విల్లాకు ఈ నోటీసులను పోలీసులు అంటించారు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి సంబంధించిన కేసులో విచారించాల్సి ఉందని, సోమవారం తమ ముందు విచారణకు హాజరు కావాలని సదరు నోటీసుల్లో పోలీసులు కోరారు. అలాగే అడ్రస్ ప్రూఫ్‌తో పాటు, కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలు సమర్పించాలని సూచించారు. అంతేకాకుండా ఒకవేళ ఈ నోటీసులను బేఖాతరు చేసి విచారణకు హాజరుకాని పక్షంలో చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లో నేడు మోకిలా పీఎస్‌లో స్వయంగా హాజరు కావాలని, లేకుండా బీఎన్ఎస్ యాక్ట్ 35(3), (4), (5), (6) సెక్షన్ల కింద అరెస్ట్ చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు.




# భారత్-స్పెయిన్ భాగస్వామ్యం సరికొత్త మార్గంలో..




### సి-295 తయారీ కేంద్రాన్ని ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

### 56 విమానాల సరఫరాకు 2021 సెప్టెంబర్లో రూ.21,935 కోట్ల ఒప్పందం

**గాంధీనగర్ :** భారత్-స్పెయిన్ భాగస్వామ్యాన్ని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సరికొత్త మార్గంలో తీసుకెళుతున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు. గుజరాత్‌లోని వడోదరలో సి-295 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు. టాటాల భాగస్వామ్యంతో ఎయిర్‌బస్ సంస్థ దీనిని నెలకొల్పింది. ఐరోపాకు చెందిన ఈ సంస్థ బయటి దేశాల్లో ఇటువంటి ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారుచేయడం ఇదే తొలిసారి. స్పెయిన్‌లో తయారైన ఈ రకానికి చెందిన కొన్ని విమానాలు గతేడాది నుంచే భారత్‌కు చేరుకోవడం మొదలైంది. ఈ ప్లాంట్ 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని ఈసందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. . "ఇటీవల భారత్ ముద్దు బిడ్డ రతన్ టాటాను కోల్పోయింది. ఆయన జీవించి ఉంటే.. నేడు ఇక్కడ మన మధ్యే ఉండేవారు. ఎక్కడ ఉన్నా ఆయన దీనిని చూసి సంతోషిస్తారు" అని మోదీ నివాళి అర్పించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ మాట్లాడుతూ ఎయిర్‌బస్, టాటాల భాగస్వామ్యం భారత వైమానిక రంగ పురోగతికి బాటలు వేస్తుందన్నారు. ఇతర ఐరోపా దేశాలు భారత్‌కు వచ్చేందుకు ఇది ద్వారాలు తెరిచిందని పేర్కొన్నారు.

**రెండేళ్ల తర్వాత ప్రధాని డేట్లను రిజర్వు చేయండి..**

ఈ సందర్భంగా టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. నేటినుంచి కచ్చితంగా రెండేళ్లలో తొలి విమానం డెలివరీ చేస్తామని ప్రధానికి హామీ ఇచ్చారు. ఆ రోజు మళ్లీ ప్రధాని ఇక్కడికి వచ్చి దానిని ఆవిష్కరించేందుకు వీలుగా తేదీని రిజర్వ్ చేసేలా పీఎంవోను కలిసి పనిచేస్తామన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన 200 మంది ఇంజినీర్లు ఇప్పటికే స్పెయిన్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. తాము 40ఎస్ఎంఈలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం 2012 నుంచే దివంగత రతన్ టాటా కృషి చేసినట్లు చెప్పారు. ఎయిర్ బస్ సంస్థతో స్నేహ సంబంధాలు నడిపి ఈ భాగస్వామ్యానికి పునాది వేశారన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ, పెడ్రో సాంచెజ్ వడోదరాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంపై రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్‌లో స్పందిస్తూ అక్టోబర్ 28 భారత వైమానిక రంగంలో ప్రత్యేకమైన రోజుగా అభివర్ణించారు. దీని ప్రారంభోత్సవంలో ఆయన కూడా పాల్గొన్నారు. భారత్‌కు 56 సి-295 విమానాల సరఫరాకు 2021 సెప్టెంబరులో రూ.21,935 కోట్లకు ఒప్పందం కుదిరింది. ఇందులో 16 విమానాలు స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ సంస్థ కర్మాగారం నుంచి అందుతాయి. మిగతావి వడోదర యూనిట్‌లో సిద్ధమవుతాయి. కాలం చెల్లిన ఆవ్రో-748 విమానాల స్థానంలో భారత వాయుసేన వీటిని ప్రవేశపెట్టనుంది. సి-295కు సంబంధించిన విడి భాగాల ఉత్పత్తి హైదరాబాద్‌లోని 'మెయిన్ కన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ'లో ఇప్పటికే ప్రారంభమైంది.

### సి-295 విమానాల గురించి..

- ఈ విమానాల్లో 40-45 మంది పారాట్రూపర్లు లేదా 70 మంది పౌరులు ప్రయాణించొచ్చు.
- 5-10 టన్నుల వస్తువులను రవాణా చేసే సామర్థ్యంతో వీటిని రూపొందిస్తున్నారు.
- భారత్ ఎలక్ట్రానిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌లు 56 విమానాల్లో అమరుస్తున్నారు.
- తక్కువ దూరం రన్‌వే సరిపోవడంతో పాటు, తాత్కాలికంగా అభివృద్ధి చేసిన ప్రాంతాల నుంచి కూడా టేకాఫ్ చేసే సామర్థ్యం వీటికి ఉంటుంది.
- ఈ విమానాల కోసం 13,400 డీటైల్ భాగాలు, 4600 సబ్ అసెంబ్లీస్, 7 ప్రధాన భాగాల అసెంబ్లింగ్‌ల ప్రక్రియ భారత్‌లోనే జరగనుంది.
- సరఫరా కోసం దేశీయంగా 125 ఎంఎస్ఎంఈలను టాటా గ్రూప్ గుర్తించింది.
- ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా 600 మంది అత్యున్నత నైపుణ్యాలు కలిగినవారికి ఉపాధి లభిస్తుంది. మరో 3000 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు, 3,000 మంది మధ్యశ్రేణి నైపుణ్యాలు కలిగినవారికి అవకాశాలు లభిస్తాయి.
- ఈ ప్రాజెక్టు కోసం స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ కేంద్రంలో సుమారు 240 మంది ఇంజినీర్లు శిక్షణ పొందుతున్నారు.

# సావు తెలివితేటలు మీవి

- సంపద పెంచే ఆలోచనలు మావి
- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ప్రజాస్వరం :** సంపద పెంచే ఆలోచనలు మావి – ఉన్నది ఊడ్చే సావు తెలివితేటలు మీవి అని ఎక్స్ వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మేము బంగారు బాతును చేతిలో పెడితే మీరు పదినెలలకే చిప్ప చేతిలో పేడితిరి అని విమర్శించారు. నీ పిచ్చి చేష్టలకు కొత్తవి కొనాలన్న పాతవి అమ్మాలన్న భయమే నని అన్నారు. నీ హైడ్రా దెబ్బకు హైడ్రాబాద్ లో సొంతింటి కలలు కలగానే మిగిలిపాయే పరిస్థితి ఉందని తెలిపారు. నీ మూసి ముష్టి పనులకు కొత్తగా కట్టేటోడు లేక కట్టినా కొనేటోడు లేక రియల్ బూమ్ కాస్త రియల్ బాంబులాయే అని ఎద్దేవా చేశారు. కాసుల పై నీ కక్కుర్తి నిర్ణయాలు రాష్ట్రని అధోగతిపాలు చెయ్యబట్టే నాడు నిత్యం కళకళలాడే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నేడు విలవిలలాడుతూ బోసిపోయ్యాయని దుయ్యబట్టారు. నీ పదినెలల పాపపు పాలనలో రాష్ట్రానికి ప్రతిరోజు నష్టమేనన్నారు.

# మోమోస్ తిని మహిళ మృతి

**20 మందికి అస్వస్థత**



**హైదరాబాద్, ప్రజాస్వరం :** హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. నంది నగర్‌లో చికెన్ మోమోస్ తిని ఒక వివాహిత మహిళ మృతి చెందగా 20 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. బాధితులు వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హైదరాబాద్‌లో నెలరోజులు ఆంక్షలు

**పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్**



**హైదరాబాద్, ప్రజాస్వరం :** హైదరాబాద్ సిటీలో నెలరోజుల పాటు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా నగరంలో సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిషేధించినట్లు పేర్కొన్నారు. ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు ఉంటాయన్నది ప్రధాన హెచ్చరిక. సిటీలో అశాంతిని సృష్టించదానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు నిర్వహించడానికి వీల్లేదన్నది అసలు పాయింట్. ఈ లెక్కన 144 సెక్షన్ అమల్లోకి వచ్చేసింది. యూ/ఎస్ 163 బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం నవంబర్ 28 వరకు ఆంక్షలు అమలు చేస్తారన్నారు. పోలీసు ఆదేశాలను గమనించిన అందరూ నడుచుకోవాలని సూచన చేశారు. ఈనెల 27 సాయంత్రం ఆరు గంటల నుంచి నవంబర్ 28 వరకు ఈ అంక్షలు అమల్లో ఉండనున్నాయి. అయితే ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద శాంతి యుత నిరసనలు, ధర్నాలకు మాత్రం అనుమతి ఉంటుందని ఆయా ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో అంతటా నిరసన ప్రదర్శలకు బ్రేక్ పడినట్లైంది. పార్టీల ముసుగులు కొందరు అలజడి సృష్టించేందుకు ప్లాన్ చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నారు.

# కోచ్‌గా తప్పుకోనున్న గ్యారీ కిర్‌స్టన్!



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ క్రికెట్‌లో వరుస కుదుపులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలే బాబర్ ఆజం వైట్‌బాల్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పడం, సెలక్షన్ కమిటీలో మార్పులు వంటివి చోటుచేసుకున్నాయి. తాజాగా ఇప్పుడు కోచ్ గ్యారీ కిర్‌స్టన్ తన పదవి నుంచి తప్పుకోనున్నట్టు తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన 4 నెలలకే ఆయన ఈ నిర్ణయానికి రావడం చర్చనీయాంశమైంది. కిర్‌స్టన్ పాకిస్థాన్ వన్డే, టీ20 ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత చాలా మార్పులు వచ్చాయి. బాబర్ ఆజం కెప్టెన్‌గా తిరిగి రావడం, ఆపై రాజీనామా చేయడం, సెలక్షన్ కమిటీలో మార్పులు తదితర ఘటనలు ఆయన 4 నెలల పదవీకాలంలోనే జరిగాయి. గత కొన్ని వారాలుగా కోచ్ కిర్‌స్టన్, ఆ జట్టు ఆటగాళ్ల మధ్య కొన్ని తీవ్రమైన అభిప్రాయ భేదాలు వచ్చాయని 'క్రిక్‌బజ్' కథనం పేర్కొంది. అటు పీసీబీ నుంచి కూడా ఆయనకు సరియైన మద్దతు లభించడం లేదని సమాచారం. డేవిడ్ రీడ్‌ను హైపర్ఫార్మెన్స్ కోచ్‌గా నియమించాలని కిర్‌స్టన్ ఇటీవల బోర్డును అభ్యర్థించాడు. కానీ, ఆయన అభ్యర్థనను పీసీబీ తిరస్కరించి, ప్రత్యామ్నాయంగా మరికొన్ని పేర్లను సూచించింది. దాంతో ఆయన నిరాశ చెందారని, ఈ నేపథ్యంలోనే ఆయన తన పదవి నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్టు కథనం పేర్కొంది.

ఒకవేళ వైట్‌బాల్ కోచ్ పదవిని కిర్‌స్టన్ వదులుకుంటే.. రాబోయే రోజుల్లో పీసీబీ అతని వారసుడిగా జాసన్ గిల్లెస్పీని నియమించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం అతడు పాక్ టెస్టు జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. అలాగే రాబోయే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని పాకిస్థాన్ మాజీ పేసర్ ఆకిబ్ జావెద్‌ను వైట్‌బాల్ కోచ్‌గా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం పాకిస్థాన్ జాతీయ సెలక్షన్ కమిటీ సభ్యులలో ఆకిబ్ ఒకరు. ఇటీవల స్వదేశంలో ముగిసిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఇంగ్లండ్‌పై పాక్ 2-1తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ అద్భుత ప్రదర్శనకు తెర వెనుక ఆకిబ్ కీలంగా వ్యవహరించారు. ఇక పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తాజాగా ఆస్ట్రేలియా, జింబాబ్వే వైట్‌బాల్ టూర్ల కోసం జట్లను ప్రకటించింది. అయితే, ఆ రెండు పర్యటనలకు కిర్‌స్టన్ జట్లతో పాటుగా ఉండడని పీసీబీ వెల్లడించింది. సో.. ఆ జట్టు వైట్‌బాల్ కోచ్‌గా దాదాపు గ్యారీ కిర్‌స్టన్ తప్పుకున్నట్టే అర్థమవుతోంది

**రాజ్ పాకాల ఫాంహౌస్ ఇష్యూపై**

# విజయ్ మద్దూరి ఏమన్నాడంటే..

**హైదరాబాద్, ప్రజాస్వరం :** కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్‌పై పోలీసుల దాడులు, కేసు నమోదు చేయడంపై సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో విజయ్ మద్దూరి కీలక వ్యాఖ్యలు చేశాడు. రాజ్ పాకాల ఫాంహౌస్‌లో జరిగిన సోదాల్లో విజయ్ మద్దూరికి పాజిటివ్ వచ్చింది. దీంతో రాజ్ పాకాలతో పాటు, ఇతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేటీఆర్ బావమరిది తనకు మద్యం ఇవ్వడంతో తాను తీసుకున్నానని విజయ్ వాంగ్మూలం ఇచ్చినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. ఈ వాంగ్మూలంపై విజయ్ మద్దూరి స్పందించాడు. తాను అనని మాటలను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారని పేర్కొన్నాడు. తన మిత్రుడు రాజ్ పాకాల తమను కుటుంబ సమేతంగా దీపావళి వేడుక కోసం ఆహ్వానించాడని... ఫాంహౌస్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగలేదని వెల్లడించాడు. కానీ తమను లక్ష్యంగా చేసుకొని పోలీసులు చేసిన ఆరోపణలు సరికాదన్నాడు. తాము ఎలాంటి తప్పూ చేయలేదన్నాడు.

# నా జీవితంలో చీకటి రోజులవే..




మాజీ విశ్వసుందరి ఐశ్వర్యరాయ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. గతంలో ఈ బ్యూటీ బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌తో కొంతకాలం ప్రేమాయణం నడిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వారిద్దరి మధ్య ఉన్న రిలేషన్ గురించి తాజాగా ఆమె పాల్గొన్న ఇంటర్వ్యూలో యాంకర్ ప్రశ్నించారు. దానికి ఐష్ షాకింగ్ సమాధానమిచ్చారు. సల్మాన్‌తో ప్రేమలో ఉన్నప్పుడు చాలా సమస్యలు ఎదుర్కొన్నట్టు ఐశ్వర్య తెలిపారు. ఆ రోజులను తన జీవితంలో చీకటి రోజులుగా అభివర్ణించారు. ఆ హీరో తనను శారీరకంగా, మానసికంగా హింసించినట్టు తెలిపారు. అందుకే ఆయనతో విడిపోవాల్సి వచ్చిందని వివరించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.